

తూపిలిపాళెం తీరం వద్ద ఎగిసిపడుతున్న సముద్రపు కెరటాలు

ఎగిసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. వాకాడు మండలం తూపిలిపాళెం తీరంలో ఆదివారం అలలు ఉధ్రుతంగా నురగలతో కనిపించాయి. తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, శ్రీనివాసపురం, వైట్ కుప్పం, నవాబుపేట తదితర గ్రామాల్లో చలిగాలులు వీచాయి. ఇప్పటికే మత్స్యకారులు పడవలు, వలలు తదితర సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

ముక్కంటి సేవలో జస్టిస్ సూర్యకాంత్


సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపికైన జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం కుటుంబ సమేతంగా జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి, ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు జస్టిస్‌ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. జిల్లా న్యాయమూర్తి అరుణ సారిక, ప్రొటోకాల్ జడ్జి గురునాథం, స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాసనాయర్, బేబీ రాణి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



చక్కని తల్లికి ఛాంగుభళా!

- పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



విష్వక్సేనుడి ఊరేగింపు



అంకురార్పణలో భాగంగా పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

తిరుచానూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి సన్నిధి ముఖమండపం వద్ద సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని కొలువుదీర్చారు. కంకణభట్టాచార్యుడు వేంపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అర్చకులు పుణ్యాహవచనం, రక్షాబంధనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనుడిని వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకొచ్చి పుట్టమన్ను సేకరించారు. ఆ పుట్టమన్నును ఆలయ మాడవీధుల్లో ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు తీసుకొచ్చి నవపాలికల్లో నింపారు. అందులో నవధాన్యాలు వేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు.

ముత్యపు కవచంలో అమ్మవారు

పద్మావతి అమ్మవారు ఆదివారం ముత్యపు కవచంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ వజ్ర, వైఢూర్య, స్వర్ణాభరణాలతో దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవ వేళ మాత్రమే అమ్మవారి మూలవర్లకు ప్రత్యేకంగా తయారు చేయించిన ముత్యపు కవచాన్ని అలంకరిస్తారు.

ఉదయం.. లక్ష కుంకుమార్చన

ఉదయం పూజల అనంతరం పద్మావతి అమ్మవారిని శ్రీకృష్ణస్వామి ముఖమండపానికి తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు అమ్మవారి లక్ష్మీసహస్ర నామాలను లక్షసార్లు జపిస్తూ కుంకుమార్చన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీంధర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో నేడు



- ఉదయం 9.10 నుంచి 9.30 గంటల మధ్య ధ్వజారోహణం జరగనుంది. తొలుత అమ్మవారితో పాటు గజ చిత్రపటాన్ని తిరువీధుల ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తారు. గజ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగుర వేయడంతో ధ్వజారోహణం ముగుస్తుంది.
- మొదటి ఏడు రోజులు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో, ఎనిమిదో రోజు రథమండపంలో మధ్యాహ్నం అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. చివరి రోజైన తొమ్మిదో రోజు ఉదయం 10 గంటలకు అమ్మవారితో పాటు చక్రత్తాళ్వార్‌కు పంచమితీర్థం మండపంలో స్నపన తిరుమంజనం జరుగుతుంది.
- సోమవారం నుంచి రోజూ సాయంత్రం 5.30 నుంచి 6గంటల వరకు ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించనున్నారు.
- సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు చిన్నశేషవాహనంపై అమ్మవారు ఊరేగనున్నారు.

ఆరుగురిపై పీడీయాక్ట్

ఎస్పీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వివిధ నేరాల్లో పాల్గొన్న ఆరుగురిపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం అక్రమ విక్రయాలు, భూకబ్జాలు చేసేవారిపైనా త్వరలో పీడీయాక్ట్ తీసుకొస్తామన్నారు. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. పదేపదే ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని స్పష్టంచేశారు. జిల్లాలోని పోలీసులు తమ పరిధిలో నేర చరిత్ర, గూండా, డ్రగ్స్ మొదలగు చర్యలకు పాల్పడే వారిపై పర్యవేక్షణ కొనసాగించి ప్రత్యేక జాబితా తయారుచేయాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై సమీప పోలీస్‌స్టేషన్ లేదా జిల్లా పోలీస్‌కంట్రోల్ రూమ్.. 112కు ఫోనుచేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

పీడీయాక్టు నమోదైన వారు

- షేక్ కాలేషా. గూడూరు మండలం చవటపాళెం. పది కేసుల్లో నిందితుడు.
- కనుపూరు శ్రీహరి అలియాస్ జెమిని(38). గూడూరు అరుంధతిపాళెం. ఆరు కేసులున్నాయి.
- సయ్యద్ అజీమ్(30). తిరుపతి నగరం కొర్లగుంట మారుతీనగర్. గంజాయి, హత్య, దొమ్మికేసులో నిందితుడు.
- వట్టికుంట అరుణకుమార్ అలియాస్ అరుణ్(32). చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కమ్మపల్లి. నాలుగు కేసుల్లో నిందితుడు.
- ఎం.సునీల్(29). నెల్లూరు నగరం పెన్నానది ఒడ్డున కలవకట్ట వద్ద నివాసం. ఇతడిపై 34 కేసులున్నాయి.
- ప్రసన్నకుమార్(32), సూళ్లూరుపేటకు చెందిన ఇతడు దొంగతనాలు, హత్యాయత్నం, గంజాయి కేసుల్లో నిందితుడు.

సరదాగా ఈతకు వెళ్లి ...

బావ, బామ్మర్ది మృతి

రేణిగుంట నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈత కొట్టేందుకు ఆదివారం మల్లిమడుగు డ్యామ్ వద్దకెళ్లారు. అక్కడి గుంతలోకి దిగి బావ, బావమరిది మృతి చెందారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. తిరుపతి మల్లగుంటకు చెందిన నర్సింగ్ శివ (32), దర్శి నరేష్(36) బావ, బావమరుదులు. స్థానికంగా జీపు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఇద్దరు తమ స్నేహితుడు చంద్రశేఖర్‌తో కలిసి ఆదివారం సరదాగా గడిపేందుకు రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాంకు వచ్చారు. గేట్లకు సమీపంలోని గుంతలో ఈత కొట్టేందుకు శివ వెళ్లారు. ఈత కొడుతూ లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో కేకలు వేస్తూ మునిగిపోతుండగా.. ఒడ్డుపై ఉన్న నరేష్ అతడిని రక్షించేందుకు నీటిలో దూకాడు. వీళ్లిద్దరూ మునిగిపోతుండగా చంద్రశేఖర్ పెద్దగా కేకలు వేస్తూ సమీపంలోని గ్రామంలోకి పరుగులు తీశారు. స్థానికులు డ్యాం వద్దకు చేరుకుని నీటిలో మునిగిపోయిన శివ, నరేష్ కోసం గాలించారు. ఇంతలో రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మునిగిపోయిన వ్యక్తులను స్థానికులు వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శివ, నరేష్ మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

హెచ్చరిక బోర్డు పెట్టినా..

మల్లిమడుగు డ్యాం వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో సందర్శకులను నిషేధిస్తారు. డ్యాం అధికారులు ప్రధాన గేటు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా సందర్శకులు లెక్క చేయడం లేదు. డ్యాం దిగువ ప్రాంతాల్లోకి వెళ్లి మద్యం తాగుతుంటారు. మద్యం మత్తులో ఈత కొట్టేందుకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

అందరం కలిసి బాలాజీ రైల్వే డివిజన్ సాధిద్దాం

- కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, భూమన్ పిలుపు

తిరుపతి(జీవకోన), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఆవశ్యకతపై గత నెలలో పార్టీలు, విద్యార్థి.. వ్యాపార సంఘాలకు అవగాహన కల్పించాం. ఇక అందరం కలిసి డివిజన్ సాధన కోసం కృషి చేద్దాం' అని బాలాజీ రైల్వేడివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్, శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ పిలుపునిచ్చారు. తిరుపతిలో ఆదివారం డివిజన్ సాధనకు సంబంధించి 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' సమావేశాన్ని నిర్వహించారు. 'బాలాజీ రైల్వేడివిజన్ ఏర్పాటైతే 10 వేల నుంచి 15వేలకుపైగా ఉద్యోగావకాశాలు వస్తాయి. పరిపాలన ప్రయోజనాలు, ఆయా పనులకు వేగవంతంగా ఆమోదాలు లభిస్తాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్దాం' అని కుప్పాల గిరిధర్ అన్నారు. 'డివిజన్ సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగాలి. రేణిగుంట నుంచి చంద్రగిరి వరకు పాదయాత్ర చేద్దాం' అని భూమన్ సూచించారు. 'ఇది ఉద్యమం వంటిది. అందరూ కలిసి రావాలి' అంటూ బాలాజీ డివిజన్ ఆవశ్యకతను విశ్రాంత ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మి వివరించారు. ఈ సమావేశంలో భూపాల్‌నాయుడు, ఆర్ఎస్‌రామిరెడ్డి, విశ్రాంత పోలీసు అధికారి కృష్ణయ్య, విశ్రాంత రైల్వే అధికారి పుష్పరాజ్, శ్రీసిటీ జీఎం రామచంద్రారెడ్డి, ఫిలిం సొసైటీ సభ్యులు బుచ్చిబాబునాయుడు, శేషగిరిరావు, హ్యూమన్ రిసోర్సెస్ ప్రభాకర్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ దామోదరరెడ్డి, అజయ్, ప్రసన్నకుమార్, వైఎస్ బాబు, మాధవీలత, చరణ్, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూమన్

పుట్టపర్తికి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19నుంచి పుట్టపర్తిలో సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాలు 24 వరకు ఆరు రోజుల పాటు జరగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం తిరుపతి నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా రవాణాధికారి జగదీష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. '30మంది బృందం ముందుకొస్తే ఒక బస్సు కేటాయిస్తాం. వ్యక్తిగతంగా వెళ్లేవారికి అడ్వాన్సు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాం' అని తెలిపారు.

నేడు డయల్ యువర్ డిస్కం సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. గృహ, వ్యవసాయ, పరిశ్రమలు, వ్యాపార రంగాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఫోను చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. 89777 16661 నెంబరుకు ఫోనుచేసి.. 91333 31912 నెంబరుకు చాట్ చేసి సమస్యలను ప్రస్తావిస్తే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

లిక్విడ్ గంజాయి కలకలం



లిక్విడ్ గంజాయి బాటిల్

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎగువ రెడ్డివారిపల్లె సమపంలోని స్వర్ణముఖినది పరిసరాల్లో లిక్విడ్ గంజాయి బాటిల్ దొరికింది. దీంతో ఆదివారం స్థానికంగా కలకలంరేగింది. కర్మక్రియల మండపం (షెడ్డు) వద్ద కొంత మంది యువకులు రోజూ మద్యం తాగడం, బాటిల్లో నింపిన గంజాయిని పొగబెట్టి పీల్చుతూ మత్తులో జోగుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పదేపదే పొలాల వద్దకు రావద్దని వారికి చెప్పినా వినడం లేదన్నారు. దీంతో మహిళలు ఒంటరిగా తమ పొలాలకు వెళ్లాలన్నా భయపడుతున్నట్లు తెలిపారు.

అసెంబ్లీ కమిటీ ఎదుటకు డీసీసీబీ అక్రమాలు

- వైసీపీ పాలనా కాలంలో నిధుల దుర్వినియోగంపై నేడు విచారణ
- కమిటీ కోరిన వివరాలతో హాజరు కానున్న డీసీసీబీ సీఈవో

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అక్రమార్కులపై చర్యలకు అడుగు ముందుకు పడింది. అయిదేళ్ల వైసీపీ పాలనలో చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో చోటు చేసుకున్న అవినీతి, నిధుల దుర్వినియోగంపై శాసనసభా సంఘం విచారణ చేపట్టనుంది. ఇందుకు సంబంధించి అనకాపల్లె ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో శాసనసభా కమిటీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియమించారు. ఈ కమిటీలో చిత్తూరు జిల్లా నుంచి ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో పాటు ఏడుగురు సభ్యులున్నారు. గత ఐదేళ్లలో ఇచ్చిన రుణాల వివరాలు, గోదాముల స్థితిగతుల గురించి శాసనసభా కమిటీ సమాచారం కోరిందని డీసీసీబీ సీఈవో శంకర్ బాబు తెలిపారు. సోమవారం జరిగే విచారణకు పూర్తి వివరాలతో హాజరవుతున్నామన్నారు.

పేరుకుపోయిన మొండిబకాయిలు: వైసీపీ హయాంలో డీసీసీబీకి సెవెన్‌మెన్ కమిటీని, 75 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలను నియమించి బినామీల పేరుతో రుణాలను బొక్కేశారు. భూమి లేకున్నా వైసీపీ కార్యకర్తలకు పంట రుణాలివ్వడంతో డీసీసీబీలో రూ.105 కోట్ల మేరకు మొండి బకాయిలున్నాయి. ఇందులో అక్రమ రుణాలను అధికారులు గుర్తిస్తున్నారు. ఆయా వివరాలన్నీ సభాసంఘం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఇక, అవసరమున్నా.. లేకున్నా గత ప్రభుత్వంలో గోదాములను నిర్మించారు. ఒక్కో గోదాము కోసం సింగిల్‌విండోలు తీసుకున్న రూ.40 లక్షలను నాలుగుశాతం వడ్డీతో ఏడేళ్లలో డీసీసీబీకి చెల్లించాలి. ఇప్పటికీ గోదాములు నిరుపయోగంగా ఉండటంతో వాటిపై రాబడిలేకుండా పోయింది.



నిరుపయోగంగా వున్న కుప్పంలో నిర్మించిన గోదాము

బ్యాంకులపై ఒత్తిడి తెచ్చి: జగనన్న తోడు పథకం ద్వారా రూ. 22 లక్షలు, జగనన్న పాల వెల్లువ ద్వారా రూ. 8 కోట్లు, కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా రూ. 4కోట్లు , ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 32 లక్షలు తీసుకున్నా.. పైసా కూడా డీసీసీబీకి తిరిగి అందలేదు. ఇలా ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారించారు. డీఆర్వో మోహన్ కుమార్‌తో విచారణ చేయించారు. 48 మంది బ్యాంకు ఉద్యోగులపై చర్యలు చేపట్టారు. డీఆర్వో ఇచ్చిన నివేదికలో రూ.23కోట్ల మేర అవినీతి జరిగినట్లు తేల్చారు.

పుస్తక లక్షాధికారి

లంకా సూర్యనారాయణకు నేడు జీవిత సాఫల్య పురస్కార ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చూడ్డానికి సాదాసీదాగా కన్పించే లంకా సూర్యనారాయణ లక్షకు పైగా పుస్తకాలు సేకరించి, సంరక్షిస్తున్నారంటే ఆశ్చర్యమేస్తుంది.గుంటూరులో పుస్తకాభిమానులు ముద్దుగా గ్రంథాళ్వార్‌గా పిలుచుకునే ఆయన గ్రంథాలయంలో చదువుకున్న అనేక మందికి ప్రపంచ విజ్ఞానం ఒంటబట్టింది.కుమారుడు కూడా వరంగల్ నిట్‌లో ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. ఎస్వీయూనివర్శిటీలోని శ్రీనివాసా ఆడిటోరియంలో సూర్యనారాయణకు నేడు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనతో ఆంధ్రజ్యోతి సంభాషణ..

నేపథ్యం

మాది గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామం. వ్యవసాయ కుటుంబం.అమ్మానాన్న పెదలక్ష్మీనారాయణ, రంగనాయకమ్మ. పత్తిపాడు హైస్కూల్లో పదవ తరగతి వరకూ ,గుంటూరులో బీఎస్సీ దాకా చదివా. కస్టమ్స్ శాఖలో సూపరిండెంట్‌గా పని చేసి రిటైరయ్యా. శ్రీ వేంకటేశ్వర ధార్మిక సేవా సమితి, అన్నమయ్య సేవా సమితి, స్వధర్మ సేవా సమితి అధ్యక్షులుగా పని చేశా.

పుస్తకాలపై ఆసక్తి

గాలీ నీరూ వెలుగూ అందరికీ ఎలా లభిస్తున్నాయో, పుస్తకాలు కూడా అంతగా అందుబాటులో ఉండాలనే చిలకమర్తి లక్ష్మీనరసింహం వ్యాఖ్య నాకు నిత్యస్ఫూర్తిని కలిగిస్తుంటుంది. దీంతో పాటు మా బాబాయి ఉప్పలపాటి ఆనందరావు కమ్యూనిస్టు కార్యకర్త. ఆయనకు విపరీతమైన పుస్తకాల పిచ్చి. ఆయన ద్వారా పుస్తకాలకు చేరువై లెక్కకుమించి చదివా.

గ్రంథాలయ ఏర్పాటుకు బీజం

గుంటూరులో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే ఆసక్తి కలిగింది.పుస్తకాలను సేకరించి, గ్రంథాలయంలో కొలువుదీర్చా. అనేకమంది సాహితీప్రముఖులు, పుస్తకాభిమానులు సందర్శిస్తుండడం చూసి నేను కూడా పుస్తక విజ్ఞాన వ్యాప్తికి కృషి చేస్తున్నాననే అనుభూతి కలుగుతుంది.ఈ గ్రంథాలయాన్ని భవిష్యత్తు తరానికి కూడా అందించాలనుకుంటున్నా.

పుస్తకాల సేకరణ


మా కుటుంబ వ్యక్తిగత గ్రంథాలయంలోనే 80 వేల పుస్తకాలుండేవి. అనేక మంది ప్రముఖులు మా ఇంటి లైబ్రరీకి వచ్చి పుస్తకాలు చదువుకునే వారు. ఇప్పుడు ఈ సంఖ్య లక్షా 30 వేలకు చేరింది. 100 మహాభాగవతాలు, 300 భాగవతాలు, 500 భగవద్గీతలు, 550 రామాయణాలు, 5 వేల ఆత్మకథలు, 51మంది అనువాదకులు చేసిన అనువాద గ్రంథాలు, 1600 శతకాలు, 700 నిఘంటువులు సేకరించా. వీటిలో ఏ పుస్తకమైనా కేటలాగ్ అవసరం లేకుండా క్షణాల్లో చేతికి అందించగలను. తెలుగు, ఇంగ్లీషు, హిందీ వంటి భాషలకు సంబంధించిన పుస్తకాలు కూడా అనేకం ఉన్నాయి. వివిధ భాషా, సాహిత్య రంగాల్లో పరిశోధన చేసే వారికి ఈ గ్రంథాలయం బాగా ఉపయోగపడుతుంది.

పుస్తకాభిమానులకు సలహా

పుస్తకాలను కొని చదవడమే కాదు, నలుగురికి అందించడం గొప్ప విషయం. మనం తెలుసుకున్న మంచి విషయాలను నలుగురికి తెలియజేయడం అవసరం. ఇది మనకు సంతృప్తిని కలిగించడమే కాక సమాజానికి కూడా మంచి చేస్తుంది.పుస్తకాన్ని మనం చదవడంతో పాటు అందరికీ చేరువ చేయడం పుస్తకాభిమానుల బాధ్యత.

లభించిన గుర్తింపు

నవ్యాంధ్ర రాష్ట్ర తొలి ఉగాది కళారత్న పురస్కారం పొందా.శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2017లో కీర్తి పురస్కారంతో సత్కరించింది. 2018లో అజోవిభో కందాళం పురస్కారాన్ని స్వీకరించా. జానుమద్ది హనుమచ్ఛాస్త్రి పురస్కారం, పాతూరి నాగభూషణం పురస్కారం, బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వారి పురస్కారం, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి సేవారత్న పురస్కార, సత్కారాలతో గుర్తింపు పొందా.



లక్ష్యం

ప్రస్తుతం తొంభై ఏళ్ల వయసులో ఒకే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. సేకరించిన పుస్తకాలను శాశ్వతంగా పరిరక్షించడానికి డిజిటలైజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నా.ఇందుకు పుస్తకాభిమానుల సహకారాన్ని కోరుతున్నా.

నారా రామ్మూర్తి నాయుడికి నివాళి



రామ్మూర్తినాయుడికి నివాళులర్పిస్తున్న నారా రోహిత్ దంపతులు, శాప్ చైర్మన్ రవినాయుడు

చంద్రగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని నారా వారిపల్లెలోని ఎన్ఆర్ఎన్ ఘాట్ వద్ద ఆదివారం నారా కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. రామ్మూర్తి నాయుడు సతీమణి ఇందిర, కుమారుడు, సినీ నటుడు నారా రోహిత్, సతీమణి శిరీష, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, టీడీపీ నాయకులు హేమంత్ రాయల్, తానికొండ రంజిత్, నారా సుబ్రమణ్యంనాయుడు, నారా కేశవులు నాయుడు ఎన్ఆర్ఎన్ ఘాట్ వద్ద పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

'పల్లెపల్లెకూ బీఎస్పీ' పోస్టర్ల ఆవిష్కరణ

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పల్లెపల్లెకూ బహుజన సమాజ్ పార్టీ కార్యక్రమం పోస్టర్లను ఆదివారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ముందుగా టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యమే బీఎస్పీ లక్ష్యమని, భారత రాజ్యాంగాన్ని మేనిఫెస్టోగా తీసుకున్న ఏకైక పార్టీ తమదేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారాన్ని దక్కించుకోవాలని కోరారు. అనంతరం చంద్రగిరిలో కరపత్రాలు పంపిణీ చేశారు.

టీడీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



మధుబాల మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కూరపాటి సుధాకర్‌చౌదరి కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శించారు. సుధాకర్‌చౌదరి వదిన మధుబాల మృతి సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. సుధాకర్‌చౌదరిని పరామర్శించారు. టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ గోస్‌బాషా పాల్గొన్నారు.

లంగ్ క్యాన్సర్‌పై ముగిసిన సదస్సు



సదస్సుకు హాజరైన వైద్యులు

తిరుచానూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక హోటల్ గ్రాండ్ రిడ్జ్‌లో ఇండియన్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ లంగ్ క్యాన్సర్ సంస్థ నిర్వహించిన రెండు రోజుల వార్షిక సదస్సు ఆదివారం ముగిసింది. టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ కైలాష్‌శర్మ దేశంలో పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్, అధునాతన చికిత్స కేంద్రాల అవసరం గురించి మాట్లాడారు. టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కుమార్ టాటా ట్రస్టులు అందిస్తున్న క్యాన్సర్ సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వీసీ ఆర్‌వీ కుమార్, వైద్యబృందం దిగంబర్ బెహరా, దివ్య ఖోస్లా, లక్ష్మీ సాంధ్య, నరేంద్ర హాలికల్, ప్రశాంత్ పెనుమాడు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం



పాకాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఎంఈవో బాబ్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు పత్తిపాటి రమేష్ నాయుడు, దామోదర ఆచారి, రెడ్డిపల్లి షాజహాన్, అరవ జయపాల్, విమల, ఆర్.భాస్కర్ నాయుడు కవితా గానాన్ని వినిపించారు. వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనం ఉపయోగపడుతుందని, అక్షర జ్ఞానముంటే అన్ని సాధించవచ్చని అన్నారు. సమాజ శ్రేయస్సును ప్రభావితం చేసేలా కవితలు చదివి వినిపించారు. గ్రంథాలయాధికారి రవీంద్రబాబు కవులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి సుబ్రమణ్యం, ఆనంద్, హరి, ప్రభు, విశ్వనాథం, శంకర్ పాల్గొన్నారు.

నేడు ఫల, పుష్ప ప్రదర్శనశాల ప్రారంభం



తిరుచానూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫ్రైడే గార్డెన్‌లో టీటీడీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఫల, పుష్పప్రదర్శనశాలను సిద్ధం చేశారు. విభిన్న పుష్పాలు, ఔషధ మొక్కలు, పండ్లు, కూరగాయలతో చేసిన దేవతాప్రతిమలు, పురాణ ఘట్టాలను ఏర్పాటు చేశారు. నరకాసురుడిని సంహరిస్తున్న సత్యభామ, పాలకడలిలోని మహావిష్ణువును కాలితో తన్నుతున్న భృగుమహర్షి, వామనావతారంలో బలి చక్రవర్తిని పాతాళలోకానికి తొక్కుతున్న విష్ణుమూర్తి విశేష ఆకర్షణగా నిలుస్తున్నాయి. సైకత శిల్పంతో తయారు చేసిన గజేంద్రమోక్షం భక్తులను విశేషంగా ఆకట్టుకుటోంది. ఫలప్రదర్శనలో 25 వేల సీజనల్ ఫ్లవర్స్, కట్ ఫ్లవర్స్ వినియోగిస్తున్నారు. ఈ పుష్పాలతో ఏనుగు, కలశం, డాల్ఫిన్, గొడుగు తదితర ఆకృతులను తీర్చిదిద్దారు. ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో వనమూలికల ప్రదర్శన, ఎస్వీ సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థ ఆదర్యంలో కళల ప్రదర్శ ఏర్పాటు చేశారు.

పంచ వేదికలపై కళారాధన

బ్రహ్మోత్సవాల సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాస సాహిత్య ప్రాజెక్ట్, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి తొమ్మిది రోజుల పాటు తిరుచానూరు ఆస్థాన మండపం, శిల్పారామంలో, తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య మందిరం, రామచంద్ర పుష్కరిణిలో పలు ఆధ్యాత్మిక, సంగీత, నాట్య వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

అమ్మవారికి చెన్నై గొడుగులు



తిరుచానూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మా వతి అమ్మవారి ఆలయానికి ఆదివారం చెన్నైకు చెందిన హిందూ మహాసభ ట్రస్టు వారు నాలుగు పెద్ద గొడుగులు, చిన్నగొడుగులు అందజేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, వాహన ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్‌నాయుడు దాతల నుంచి వాటిని అందుకున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నటరాజ అకాడమీకి చెందిన కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. యుగనశ్రీ, పర్ణశ్రీ, లావణ్య, జశ్వంత్, సౌజన్య, జ్యోతిత, లలన్‌రాజ్, జినిసా, శ్రీనిధి తదితర కళాకారులు అలరించారు.

వరసిద్ధుడి సేవలో హీరో సాయిధరమ్‌తేజ్



సాయిధరమ్‌తేజ్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల (కాణిపాకం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధుడిని ఆదివారం సినీ హీరో సాయిధరమ్‌తేజ్ దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

పంట పొలాలపై గజరాజుల బీభత్సం







ఏనుగుల దాడిలో విరిగిన ఫెన్సింగ్ కూసాలు- ధ్వంసమైన టమోటా, వరి పంటలను చూపుతున్న రైతులు

భాకరాపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : చిన్నగొట్టిగల్లు మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని ఎగువూరు గ్రామం వులసలవాండ్లపల్లెకు చెందిన తారకేశవ, జయరామయ్యకు చెందిన మామిడి తోటలకు వేసిన కూసాలను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన మరో రైతు వరి పంటను ధ్వంసం చేసి సమీపంలోని మీసాల వంక ప్రాంతానికి వెళ్లాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి బొగ్గలవాండ్లపల్లె, పాలకుమాలపల్లె, గాండ్లపల్లెవైపు వచ్చే అవకాశమున్నందున రైతులెవరూ అటు వైపు వెళ్లవద్దని హెచ్చరించారు.

పరకామణి కేసును సిట్టింగ్ జడ్జితో విచారించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు16(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి కుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వి.నాగరాజు(సీపీఎం), రాంభూపాల్ రెడ్డి(కాంగ్రెస్), కందారపు మురళి(సీఐటీయూ), సుబ్రమణ్యం(ఆర్‌పీఐ), పి.సాయిలక్ష్మి (ఐద్వా) మట్లాడుతూ పరకామణిలో చోరీ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ హత్యకు కారకులైన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వార్తను వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టు శ్రీనివాసులుకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న రవికుమార్ టీటీడీకి రూ.140 కోట్ల ఆస్తులు రాసివ్వడం అనుమానాలకు తావిస్తోందని, దానిపైనా సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. 35 ఏళ్ల నుంచి పరకామణిలో అక్రమాలు జరుగుతుంటే అధికారులు, పాలకమండలి పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వైసీపీ పాలనలో టీటీడీ చైర్మెన్లు రవికుమార్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అక్రమాలు జరుగుతున్నాయని ప్రశ్నిస్తే కేసులు బనాయించడం అన్యాయమని విమర్శించారు. ఈ సమావేశంలో డీఎంసీ భాస్కర్, కృష్ణ, జయచంద్ర, సుకుమార్ ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌భూపాల్ రెడ్డి

ఘనంగా కార్తీక వనభోజనాలు





ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేద పండితులు- కార్తీక వనభోజనాలను వడ్డిస్తున్న డిప్యూటీ ఈవో వరలక్ష్మి

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీవారిమెట్టు మార్గం పార్వేటి మండపం వద్ద ఆదివారం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ముందుగా శ్రీనివాస మమంగాపురంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా పార్వేట మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు రుచికరమైన వంటకాలను భక్తులకు వడ్డించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారథి, నారాయణచార్యులు, శేషాద్రిచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చినబాబుకు ఆత్మీయ సత్కారం

తిరుచానూరు, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరి శ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా నియ మితులైన చినబాబును ఆదివారం డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఊట్ల సురేంద్రనాయుడు, పాతకం వెంకటేష్, ధనంజయ, సుబ్బుయాదవ్, దేవాచారి, ముని, హేమంత్ ఉన్నారు.



చినబాబును సత్కరిస్తున్న మునికృష్ణ

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ




ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిటకిటలాడింది. వేకువ జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



క్యూలైన్లలో వేచివున్న భక్తులు



రామానుజం సర్కిల్ వద్ద విద్యుద్దీపాలంకరణ





బ్రహ్మోత్సవ శోభ

తిరుచానూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరుకు బ్రహ్మోత్సవ శోభ వచ్చింది. సోమవారం నుంచి మొదలయ్యే పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు .. ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరిగింది. ఈ ఉత్సవాల కోసం రామానుజ సర్కిల్ నుంచి తిరుచానూరులోని అమ్మవారి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. దేవతామూర్తులు, తోరణాలు, వివిధ ఆకృతులతో చేపట్టిన దీపాలంకరణలతో ఈ ప్రాంతం వెలిగిపోతోంది. ఆలయ మహాద్వారం, మాడవీధులు, పరిసరాల్లో రంగవల్లులతో తీర్చిదిద్దారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణ గిరిలో తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: **రూ.3.16 కోట్లు**
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: **73,852**
తలనీలాలు సమర్పించినవారు: **31,277**

జాతీయ స్థాయిలోనూ రాణించాలి


దేవిశ్రీప్రసాద్, హితేష్‌ను సన్మానిస్తున్న శాప్ చైర్మన్

తిరుపతి(క్రీడలు), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 68వ జాతీయ షూటింగ్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన పి.హితేష్‌ను, 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన దేవిశ్రీప్రసాద్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు అభినందించారు. ఆదివారం శ్రీనివాస క్రీడా సముదాయంలో కలవగా వారిని ఘనంగా సన్మానించి, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. డీఎస్‌డీవో శశిధర్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


తిరుమల ఆలయం ఎదుట సజ్జనార్ కుటుంబసభ్యులు

తిరుమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. **తిరుచానూరు:** అంతకుముందు ఆయన తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయాధికారులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో ప్రతిభ


శరద్యాసాహూ, చేతన్‌రెడ్డి, లోహిత్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(క్రీడలు), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన ఫస్ట్ సబ్ జూనియర్ గ్రూపు 4 అండ్ 5 ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన సి.లోహిత్‌కుమార్‌రెడ్డి ప్రతిభ కనబరిచాడు. రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. అలాగే స్థానిక ఎడిఫై పాఠశాలలో జరిగిన జాతీయ స్థాయి ఎడి స్పోర్ట్స్‌మీట్‌లో చేతన్‌రెడ్డి మూడు, శరద్యాసాహూ రెండు బంగారు పతకాలు అందుకున్నారు. శాప్ కోచ్ చక్రవర్తి వారిని అభినందించారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌కు మంత్రి సన్మానం


తోట వాసును సత్కరిస్తున్న మంత్రి నారాయణ

తిరుపతి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) : కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన తోట వాసును రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అభినందించారు. ఆదివారం నెల్లూరు లో జరిగిన ఓ కార్యాలయంలో తోట వాసుకు జ్ఞాపిక అందజేసి, శాలువతో సత్కరించారు. ఆయన తండ్రి తోట వెంకటేశ్వరరావు టీడీపీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

సీజేకు ఘన వీడ్కోలు



తిరుపతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనార్థం తిరుగు ప్రయాణమైన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ దంపతులకు ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, నగర కమిషనర్ మౌర్య వీడ్కోలు పలికారు. ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో మౌర్య వారిని కలిశారు.

రోగులకు సేవ వరంలా భావించాలి


సదస్సులో మాట్లాడుతున్న నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోగులకు సేవ చేయడం వరంలా భావించాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సరస్వతి, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు అన్నారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ సేవా నిలయంలో స్విమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందికి ఆదివారం జన్ శిక్షణ సంస్థాన్ సహకారంతో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్విమ్స్‌కు రోజూ వందలాది మంది రోగులు వస్తుంటారని, ఆస్పత్రి లోపల, బయట మెరుగైన పారిశుధ్యం ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళా కార్మికులకు రాత్రి సమయంలో ఇబ్బందులు వస్తే శక్తి యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ యాప్ ఉపయోగాలను వివరించారు. ఈ సదస్సులో ఏఎస్‌ఐ గిరిజ, జేఎస్‌ఎస్ అధికారి హరి, రాస్ అధికారులు రవి, అన్‌బళగన్ పాల్గొన్నారు.

బీసీల కులగణన సమగ్రంగా జరపాలి

తిరుపతి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీసీల జనాభా దామాషా మేరకు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వం సమగ్ర కులగణన జరిపించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంభం లోకయ్య ఒక ప్రకటనలో కోరారు. 139 బీసీ కులాలలో ఎవరు ఎంతశాతం ఉన్నారో తెలియకుండా రిజర్వేషన్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఇదే అంశంపై సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు హైకోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. హైకోర్టు సంబంధిత విభాగాల కార్యదర్శులకు నోటీసులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనంలో పెట్టుకుని సామాజిక న్యాయం అందించాలని కోరారు.

తిరుమల ఘాట్‌లో కారు బోల్తా

- తమిళనాడు భక్తులకు గాయాలు



తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్ రోడ్డులో ఆదివారం ఓ కారు బోల్తాపడింది. చెన్నైకు చెందిన పొన్నాంబళం, గణేష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తమ టీఎన్ 11 జెడ్ 4538 నెంబరు కారులో ఆదివారం ఉదయం అలిపిరికి చేరుకున్నారు. భద్రతా తనిఖీల అనంతరం ఉదయం 10 గంటలకు తిరుమలకు బయలుదేరారు. 6వ కిలోమీటరుకు సమీపంలోని మలుపులో కారు అదుపుతప్పి బోల్తాపడింది. కారులోని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

నేటి నుంచి ఎస్వీయూలో అంతర్జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో సోమవారం నుంచి అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్ సెంటర్ - ఎస్వీయూ లైబ్రరీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. లైబ్రరీ 2047 - డెమొక్రటైజింగ్ నాలెడ్జ్ టువర్డ్స్ వికసిత్ భారత్ అంశంపై చేపట్టనున్న ఈ సదస్సు మూడు రోజుల పాటు కొనసాగనుంది. ప్రారంభ సభ ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ఇగ్నో యూనివర్సిటీ వీసీ ఉమా కంజిలాల్, ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు, ఇన్‌ప్లిబ్‌నెట్ డైరెక్టర్ దేవిక పి.మదళ్లి, శ్రీలంకలోని యువ వెల్లాస యూనివర్సిటీ వీసీ కొలిత విజయశేఖర పాల్గొంటారు. 500 మంది దేశ, విదేశీ ప్రతినిధులు హాజరై పేపర్, పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్ చేయనున్నారు. ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ కొంగర సురేంద్రబాబు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం శ్రీనివాసా ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు.

కార్తీక వనభోజనం



డప్పు కళాకారిణి గంగులమ్మకు సన్మానం

రామచంద్రాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువుకట్ట కామాక్షి సమేత కోటి లింగేశ్వరస్వామి ఆలయం వద్ద కమ్యూనిటీ పారా మెడికల్ ప్రైమరీ హెల్త్‌కేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డప్పు కళాకారణి డప్పు వాయిద్యంతో అలరించారు. ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, కార్యదర్శులు జనార్దన్, మంజుల, కోశాధికారి చలపతి పాల్గొన్నారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

24 దుంగల స్వాధీనం


స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం శ్రీకాళహస్తి మండల పరిధిలో కూంబింగ్ నిర్వహించి, నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ బృందం శనివారం నుంచి శ్రీకాళహస్తి మండలం ఆదవరం బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహించారు. ఆదివారం ఉదయం సదాశివకోన ప్రాంతం చేరుకునే సరికి కొంతమంది ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ వారి కంటబడ్డారు. చుట్టుముడుతుండగా దుంగలను వదలి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంబడించి ముగ్గురిని పట్టుకోగలిగారు. వారు తమిళనాడులోని కుల్లకురిచ్చి జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. ఆ ప్రాంతంలో పడి ఉన్న 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే శ్రీకాళహస్తి మండలం తీర్థాలపాల కోన వద్ద ఏఆర్ఎస్ఐ మహేశ్వరనాయుడు బృందం కూంబింగ్ నిర్వహిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. వారు పోలీసులను గమనించి దుంగలు పడేసి పారిపోయే ప్రయత్నం చేశారు. ఒకరిని పట్టుకోగలిగారు. అతను తమిళనాడు కలకురిచ్చి జిల్లాకు చెందినవాడిగా గుర్తించారు. సమీపంలో 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండుచోట్ల పట్టుబడ్డ స్మగ్లర్లను, 24 ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ ఖాదర్‌బాషా, ఎస్‌ఐ రఫీ కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కవి సమ్మేళనం


కవులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక అన్నమయ్య కూడలిలోని గ్రంథాలయంలో ఆదివారం కవిసమ్మేళనం నిర్వహించారు. ప్రజా కళావేదిక వ్యవస్థాపకులు అరవ జయపాల్, గ్రంథాలయాధికారి శివప్రసాద్ సంయుక్తంగా నిర్వహించారు. ప్రముఖ రచయిత రాసాని, పద్మావతి వర్సిటీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ యువశ్రీ, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాసాని మాట్లాడుతూ పుస్తకమే గురువు, స్నేహితుడు అన్నారు. యువశ్రీ మాట్లాడుతూ జ్ఞానమే నిజమైన సంపదన్నారు. ఆలోచనల విస్తరణకు, వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గుత్తా హరి సర్వోత్తమ నాయుడు మాట్లాడుతూ పుస్తకమున్నచోట వెలుగు ఉంటుందన్నారు. నాగరికతకు గుర్తు అక్షర జ్ఞానమే అన్నారు. అరవ జయపాల్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో సామాజిక చైతన్యం సాధ్యమన్నారు. అనంతరం కవులు తమ కవితలతో కార్యక్రమాన్ని రంజింపజేశారు. నిర్వాహకులు వారిని సన్మానించారు.

అడ్వెంచర్ అడిక్ట్స్ విద్యా ట్రెక్కింగ్

- పాల్గొన్న 110 మంది విద్యార్థులు


ట్రెక్కింగ్‌లో పాల్గొన్న అశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

తిరుపతి(విద్య), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి అడ్వెంచర్ అడిక్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేకంగా ఎడ్యుకేషనల్ ట్రెక్కింగ్ ఆదివారం నిర్వహించారు. చంద్రగిరి - తాటికోన ప్రాంతంలోని అటవీ, కొండ ప్రాంతాల్లో ఈ విద్యా సాహసయాత్ర సాగింది. తిరుపతికి చెందిన అశ్వమేథ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు 110 మంది పాల్గొన్నారు. ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తూ.. కొండకోనల్లో శారీరక పటుత్వానికి పదునుపెడుతూ విద్యార్థులు ఈ యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒత్తిడితో కూడిన రోజువారీ విద్యా సాధన కార్యక్రమాల నుంచి విద్యార్థులకు కాస్తంత ఉపశమనం కలిగించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

తుడా అప్రూవల్ స్థలంలో వైసీపీ శవ రాజకీయాలు

ఆ స్థలం జోలికొస్తే చట్టపరమైన చర్యలు : జ్యోతీశ్వరి



తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పట్టా రికార్డులతో పాటు, తుడా అనుమతులు కలిగిన స్థలంలో కొందరు వైసీపీ నాయకులు శ్మశానం అంటూ శవరాజకీయాలు చేస్తున్నారని స్థల యజమాని జ్యోతీశ్వరి మండిపడ్డారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఎమ్మార్‌పల్లి శ్మశాన స్థలాన్ని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆక్రమిస్తున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం చేసిందని, 3 సెంట్లు కలిగిన రెండు స్థలాలు తమవేనని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు రికార్డులు పరిశీలించి చెబుతున్నప్పటికీ కొందరు వినడంలేదన్నారు. తాము నిర్మాణాలు చేపడుతుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మా కుటుంబ సభ్యులు 1986లో ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసి తుడా అప్రూవల్ తీసుకున్నట్టు చెప్పారు. కొన్ని కారణాల వలన ఇల్లు నిర్మించడంలో ఆలస్యమైందని, ఇప్పుడు గదిని నిర్మించు కుంటుంటే సంబంధంలేని వ్యక్తులు చొరబడి పనివారిని బెదిరించి తరిమేస్తున్నారన్నారు. తవ్విన పునాదులను పూడ్చేసి రెండు శవాలను అక్కడ పూడ్చారన్నారు. 20 అడుగుల రోడ్డు పక్కన నిత్యం జనసంచారం ఉండే చోట శవాలను పాతిపెడుతున్నారన్నారు. ప్రైవేటు ఆస్తుల్లో ఇలా చేయడం సమంజసం కాదన్నారు. ఈ విషయమై కలెక్టర్, ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. తహసీల్దారు కార్యాలయం నుంచి పత్రాలు వచ్చేంత వరకు దౌర్జన్యకారులు ఆ స్థలంలోకి ప్రవేశిస్తే శిక్షార్హులవుతారన్నారు.

దివ్యారామంలో వనభోజన మహోత్సవం



తిరుపతి(ఆటోనగర్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక దివ్యారామంలో ఆదివారం అఖిల భారత తోట వారి ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజారి గిరీష్ తోట కుటుంబ సభ్యులతో కార్తీక దామోదర వ్రతం, కల్యాణ మహోత్సవం, సుమంగళి పూజ, తులసి, ఉసిరి మొక్కలకు పూజలు చేయించారు. కలశ స్థాపన చేసి, దంపతులు నేతి దీపాలు నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నిర్వాహకులు తోట వెంకటేశ్వర్లు, తోట లక్ష్మీనారాయణ, తోట రామ్‌సాయి, తోట మధుసూదన్ పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంగీత కచేరి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంగీత కచేరి అందరినీ ఆకట్టుకుంది. అన్నమాచార్యులవారు కైవల్య సిద్ధి పొందిన బహుళ ద్వాదశి తిథి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం శ్రోతలను అలరించింది. అన్నమాచార్య ప్రాజెక్టు గాత్ర కళాకారుడు సుబ్రహ్మణ్యం దేవ శిఖామణి, ఆది దేవ, వేడుకొందామా వంటి అన్నమాచార్య కీర్తనలను గానం చేశారు. వయోలిన్‌పై ఉదయ్ కుమార్, తబలాపై శోభనాద్రి, శృతి రిథమ్స్‌పై శ్రీనివాసులు వాద్య సహకారం అందించారు.

ముగిసిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వార్షిక సమావేశం

- రాష్ట్రంలో మొదటిసారిగా చారిత్రక వైజ్ఞానిక ఉత్సవం
- పరిశోధన, ఆవిష్కరణల మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు స్థానం


మాట్లాడుతున్న ఐసర్ రిజిస్టర్ కోహ్లి

ఏర్పేడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్రీయ శ్రేష్ఠతకు కొత్త అధ్యాయం లిఖిస్తూ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)లో నవంబరు 14 నుంచి 16 వరకు జరిగిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(ఐఏఎస్) 91వ వార్షిక సదస్సు ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఐసర్ రిజిస్ట్రార్ డైరెక్టర్ ఇంద్రప్రీత్ కోహ్లి మాట్లాడుతూ ఈ వార్షిక సమావేశం తమ సంస్థ శాస్త్రీయ ప్రయాణంలో కొత్త అధ్యాయాన్ని ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో సీఐఐ సదస్సు జరుగుతున్న తరుణంలో దేశంలో ప్రముఖ మేధావులకు ఆతిథ్యం ఇవ్వడం ఆంధ్రప్రదేశ్‌లో సైన్స్ పరిశ్రమల ఆవిష్కరణల శక్తివంతమైన కలయికను సూచిస్తుందన్నారు.

సైన్స్ అవుట్ రీచ్

విద్యార్థులకు ప్రేరణ, ముఖ్యంగా ఐసర్ తిరుపతి ఈ మేధోపరమైన సెషన్లతో పాటు ఈ ప్రాంతంలోని పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా సైన్స్ ప్రచారం(ఔట్రీచ్) పట్ల తన నిబద్ధతను చాటుకుంది. భవిష్యత్తు తరాలను ప్రేరేపించాలనే లక్ష్యంతో యువ మేధావులకు ప్రాక్టికల్ సైన్స్ ఇంటరాక్షన్లు, మోటివేషన్ సెషన్లను నిర్వహించారు.

చారిత్రక ప్రాధాన్యం

రాష్ట్రంలో ఈ స్థాయిలో జరిగిన మొట్టమొదటి జాతీయ శాస్త్రీయ సమావేశం ఇదే కావడంతో చారిత్రక ప్రాధాన్యతను చాటింది. తద్వారా రాష్ట్రం, జాతీయ, అంతర్జాతీయ శాస్త్రీయ, విద్యాపరమైన మ్యాప్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. మూడు రోజుల పాటు జరిగిన ఈ సమావేశంలో దేశంలోని ప్రముఖ సంస్థల నుంచి ప్రముఖ శాస్త్రవేత్తలు, అకాడమీ సభ్యులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. వ్యాక్సిన్ అభివృద్ధి, సుస్థిరత, ఖగోళ భౌతిక శాస్త్రం, ఏఐ ఆధారిత సైన్స్ వాతావరణ అధ్యయనాలు, పరిణామ జీవావరణ శాస్త్రం వంటి అత్యాధునిక రంగాలను కవర్ చేస్తూ ఆసక్తికరమైన ఉపన్యాసాలు, చర్చలు జరిగాయి. శక్తివంతమైన ఆలోచనల మార్పిడికి, విజ్ఞాన సహకారానికి ఈ సదస్సు వేదికైంది.

ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయాం

- వెంకటరెడ్డిని శిక్షించండి


మాట్లాడుతున్న బాధితులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయమని, నిందితుడు వెంకటరెడ్డిని కఠినంగా శిక్షించాలని మదనపల్లెకు చెందిన లక్ష్మీ తాయారమ్మ, కర్నూలుకు చెందిన కౌశిక్ కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ అమెరికా కొలంబస్ సెంట్రల్ యూనివర్సిటీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ జాయిన్ చేయిస్తామని హైదరాబాద్‌కు చెందిన ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీ నిర్వాహకులు మారెడ్డి వెంకటరెడ్డి, చైతన్య విద్యార్థుల వద్ద డబ్బు వసూలు చేశారని తెలిపారు. ఆ కళాశాలలో చదవకపోయినా సర్టిఫికెట్లు ఇస్తారని నమ్మించారన్నారు. తీరా బ్యాంకు రుణం కోసం వెళ్లగా ఆ కళాశాలకు ఎలాంటి గుర్తింపు లేదని తేలిందన్నారు. దీనిపై కన్సల్టెన్సీ నిర్వాహకులను సంప్రదిస్తే 'డబ్బు తిరిగి ఇచ్చేది లేదు.. ఏం చేస్తారో చేసుకోండి' అంటూ బెదిరించారన్నారు. తెలంగాణ సీఎం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. రంగారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


విజయ్‌కుమార్

తిరుపతి (విశ్వ విద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీ శిక్షా శాస్త్ర పరిశోధకుడు ఎస్వీ విజయకుమార్ డాక్టరేట్ పొందారు. అంతర్జాల ఆధారిత సంసాధనముల వికాసం-ప్రాయోగిక అధ్యయనం అంశంపై ప్రొఫెసర్ ప్రహ్లాదజోషి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

డాక్టరేట్ ప్రదానం


రాజమ్మ

తిరుపతి (విశ్వ విద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ ఎడ్యుకేషన్ విభాగ పరిశోధకురాలు ఎం.రాజమ్మ డాక్టరేట్ పొందారు. అకడమిక్ అచీవ్‌మెంట్ ఇన్ రిలేషన్ టు మెంటల్ హెల్త్ అకాడమిక్ స్ట్రెస్ అండ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ అమాంగ్ హైస్కూల్ స్టూడెంట్స్ అంశంపై డాక్టర్ మాధవి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

ఘనంగా అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవం



అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తబృందం

సూళ్లూరుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో అయ్యప్ప స్వామి భక్తబృందం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. జీఎన్‌టీ రోడ్డు చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న అయ్యప్ప ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి అయ్యప్ప స్వామి జ్యోతుల గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. బాణసంచా పేలుళ్ల, కేరళ బ్యాండ్ మేళాలు, అయ్యప్ప భక్తబృందం భజనల నడుమ అయ్యప్పస్వామిని ఆలయం వద్ద నుంచి జీఎన్‌టీ రోడ్డు, బాపూజీ వీధి, కచ్చేరివీధి, పాండురంగ, పార్కు వీధుల్లో ఊరేగించారు. మహిళలు దీపాలు చేతపట్టుకుని దీపపూజలో పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్ల ఎంపిక




జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్లతో ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఆదివారం జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జట్లను ఎంపిక చేశారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని పలు విద్యాసంస్థల నుంచి 50 మంది బాలబాలికలు హాజరయ్యారన్నారు. వీరికి పోటీలను నిర్వహించి జిల్లాస్థాయి జట్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈనెల 21,22 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా సొండిపూడిలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, చెంచయ్య, మహేష్, కోటేశ్వర రావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

గూడూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రూరల్ ఎస్‌ఐ తిరుపతయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైనా ధృవీకరణ పత్రాలులేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు చేపడుతామన్నారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కొండవల్లిపాడులో పురాతన విగ్రహాలు



అమ్మవార్ల సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహాలు

ఓజిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కొండవల్లిపాడులో పురాతన విగ్రహాలు బయటపడ్డాయి. కొద్ది రోజుల కిందట గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో తవ్వకాలు జరుపుతుండగా విగ్రహాలు బయటపడ్డాయి. ఇవి వందల ఏళ్ల కిందటి విగ్రహాలుగా స్థానికులు చర్చించుకోవడంతో ఈ విషయం ఆదివారం వెలుగు చూసింది. ఇవి అమ్మవార్ల సమేత వెంకటేశ్వర స్వామి విగ్రహాలని కొందరు చెబుతుండగా, విష్ణుమూర్తి అవతారంగా కొందరు భావిస్తున్నారు.

చెందోడులో రక్తదాన శిబిరం

కోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో ఆదివారం ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. ఆ సంస్థ చైర్మన్ లీలామోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో యువతి, యువకులు రక్తదానం చేశారు. గూడూరుకు చెందిన మేడీపల్స్ బ్లడ్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ మద్దిశెట్టి సురేష్, విశ్రాంత హెచ్‌ఎం రామశెట్టి ఆధ్వర్యంలో రక్తదాతలను షీల్డ్‌లు, మెమోంటోలు, ప్రసంశాపత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో వంశీధర్‌రెడ్డి, చంద్రమౌళి, అనిల్‌అశోక్, బాలు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల అందజేత

నాయుడుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్, బస్టాండ్, ఆలయాలు, కూడలి ప్రాంతాల్లో నిరుపేదలకు తడకండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ చైర్మన్ నెల్లూరు నాగరాజు హార పొట్లాలు, వాటర్ బాటిళ్లను ఆదివారం అందజేశారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

నాయుడుపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతువానిగుంటలో గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైంది. బాధితురాలి కథనం మేరకు... లోతువానిగుంటలో నివాసం ఉంటున్న సుబ్బమ్మ ఆదివారం తమ కుమార్తెలతో కలిసి కూలి పనులకు వెళ్లింది. ఇంట్లో ఉన్న సిలిండర్ పేలడంతో మంటలు అంటుకున్నాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఇంటి నిర్మాణం కోసం బీరువాలో దాచిన రూ.2 లక్షల నగదు, బంగారు ఆభరణాలు కాలిపోయినట్లు బాధితురాలు సుబ్బమ్మ ఫిర్యాదులో పేర్కొంది.

పేకాట స్థావరంపై దాడి

9 మంది అరెస్టు

కోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోట మండలం ఊనుగుంటపాళెం సమీపంలోని జామాయిల్ తోటల్లో పేకాట స్థావరంపై ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.65 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.



ఆగిపోయిన నగర వనం ముఖద్వార పనులు - అసంపూర్తిగా ఉన్న స్టేడియం - నిరుపయోగంగా మారిన చిన్నారుల ఆట వస్తువులు

ఆహ్లాదం.. ఆమడ దూరం

అటకెక్కిన నగర వనం పనులు

వెంకటగిరి టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలన్న ధ్యేయంతో తలపెట్టిన నగర వనం పనులు అటకెక్కాయి. వెంకటగిరి - తిరుపతి జాతీయ రహదారిలో వెంక య్యస్వామి ఆలయ సమీపంలో 45ఎకరాల విస్తీరణంలో రూ.1.60కోట్లతో ఈ ఏడాది ఫిబ్రవరిలో నగర వనం ఏర్పాటు పనులు ప్రారంభించారు. నగర వనంలో ఆర్చి టవర్, యోగా కేంద్రం, వాకింగ్ ట్రాక్, స్టేడియం, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటుతో పాటు పచ్చదనం కోసం పలు రకాల మొక్కలు నాటారు. ఇందుకోసం ఇప్పటి వరకు రూ.1.20కోట్లు ఖర్చు చేశారు. అయితే ఈ పనులేవీ పూర్తి కాలేదు. అన్నీ అరకొరగానే చేసి అసంపూర్తిగా వదిలేశారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో నగర వనంలో వడంతో విలువైన పరికరాలు తుప్పుపడుతున్నాయి. చిల్డ్రన్స్ పార్కులో



మూత పడిన నగర వనం

ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. అధికారులు దృష్టి సారించి నగరవనం పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసురావాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం: పాశిం



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని సంగం థియేటర్ సెంటర్‌లో రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల లోపే మున్సిపాలిటీ పరిధిలో రూ.9 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. సంగం థియేటర్ సెంటర్ నుంచి పోటుపాళెం జాతీయ రహదారి వరకు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. త్వరలోనే అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. అనంతరం చెరువు కట్టను పరిశీలించి మొక్కలు నాటారు. గూడూరు చెరువు కట్టను ఆధునీకరించి చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్, పార్కును ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తుడా పరిధిలోని మున్సిపాలిటీల్లో వసతుల మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వారు మండలంలోని నెల్లటూరు గ్రామంలో పర్యటించారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులకు కోటి రూపాయలు నిధులు మంజూరు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన్‌రావు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, పట్టాభిరామిరెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

చిట్టమూరు, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): చిట్టమూరులో అయ్యప్పస్వామి పడి పూజ, జ్యోతి మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమంతో పూజను ప్రారంభించారు. 108 కలశాలలోని ద్రవ్యాలతో స్వామి పంచలోక విగ్రహానికి, మొదటిసారి అయ్యప్పమాల ధరించిన భక్తులు అభిషేకాలు చేసి మహానైవేద్యం సమర్పించారు. పడిపూజ జరిగే ప్రాంగణమంతా శబరిమల పుణ్యక్షేత్రంగా సెట్టింగ్ వేసి అయ్యప్ప స్వామి ప్రతిమతో తీర్చిదిద్దారు. కేరళకు చెందిన గురుస్వాములు, కత్తి మోహన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రాత్రి అఖండ జ్యోతిని వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పేట క్రీడాకారులు

నాయుడుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మనీషా, ప్రధాన కార్యదర్శి పి.అఖిల్, కోచ్ ఉయ్యాల పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. కాకినాడలోని సూర్యా కళామందిర్‌లో ఈనెల 15,16 తేదీల్లో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. ఇందులో సబ్ జూనియర్ బాలికల విభాగంలో పి.పూజిత, ఎ.మహిత బంగారు పతకాలు, బి.భవానీ క్యాంస పతకం, సబ్ జూనియర్ బాలుర విభాగంలో సీహెచ్ రుషికేష్ వెండి పతకం, మోహిత్‌సాయి, ఎం.నిరీక్షణ్ క్యాంస పతకాలు కైవశం చేసుకున్నారు. వీరు వచ్చే నెలలో ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్ పవన్‌కుమార్ తెలిపారు.



తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు కోచ్ పవన్‌కుమార్

కార్తీక మాస వనభోజనాలు



భవానీశంకరుడి విగ్రహానికి అన్నాభిషేకం చేస్తున్న వేదపండితులు

కోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటమ్మ ఆలయ ప్రాంగణంలో వెలసిన భవానీశంకరుడి ఆలయంలో ఆదివారం కార్తీక మాస వనభోజనాలు జరిగాయి. గోపూజతో పాటు భవానీశంకరుడికి రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం భవానీశంకరుడి విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ అన్నాభిషేకం జరిగింది. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, కవితమ్మ దంపతులతో పాటు షిరిడీసాయి అక్షయసేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య ఆధ్వర్యంలో భవానీశంకరుడికి పలు అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిధ్యాల మధ్య భవానీశంకరునికి పల్లకీసేవలు నిర్వహించారు. కోటకు చెందిన షిరిడీసాయి అక్షయసేవాసమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో వనభోజనాలు నిర్వహించారు. రాజమండ్రిలోని మండపేట వారిచే జడ కోలాటం ఆడారు.



సరస్సులో జాలర్ల చేపలవేటను శ్రీహరికోట రోడ్డులో వంతెనపై నుంచి పరిశీలిస్తున్న సందర్శకులు - సరస్సులో పక్షుల కిలకిలరావాలు

పులికాట్‌లో సందర్శకుల సందడి

సూళ్లూరుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులికాట్ తీరం సందర్శకులతో సందడిగా మారింది. తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు సరస్సుకు భారీగా వరదనీరు చేరి నిండుకుండను తలపిస్తోంది. విదేశీ వలస పక్షులు కిలకిలరావాలతో కనువిందు చేస్తున్నాయి. ఆదివారం సెలవు కావడంతో సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో పులికాట్ తీరం వెంబడి సందర్శకుల తాకిడి అధికంగా కనిపించింది. కుదిరి నుంచి అట్టకానితిప్ప మధ్య సరస్సులో పక్షులు ఎగురుతూ చక్కెర్లు కొడుతూ కనిపంచాయి. సందర్శకులు సరస్సు అంచున తిరుగుతూ సెల్‌ఫోన్‌లో పక్షులను బందిస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు.

టీడీపీ నేతకు పరామర్శ

దొరవారిసత్రం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పొదిలి భాస్కర నాయుడిని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేసుకొన్న భాస్కర నాయుడు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం ఆయన ఇంటికి వెళ్లిన నెలవల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొన్నారు. నెలవల వెంట టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, సొసైటీ అధ్య క్షుడు ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, డైరెక్టర్ సంచి విజయ్‌కుమార్, స్థానిక నాయకులు ప్రసాద్‌నాయుడు, చంద్రయ్యనాయుడు, బాబు నాయుడు తదితరులు ఉన్నారు.



భాస్కర నాయుడిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

కాలేషా మృతి తీరని లోటు

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు కాలేషా మృతి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు క్లబ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో కాలేషాకు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లపాటు సీపీఐలో పనిచేస్తూ ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కాలేషా అలుపెరగని పోరాటాలు సాగించారన్నారు. పార్టీ పటిష్టతకు ఆయన ఎంతో కృషిచేశారన్నారు. ఆయన సేవలు మరువలేని వన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, గోపాల్, గోను శివకుమార్, విజయ్‌కుమార్, ప్రభాకర్, శశికుమార్, సీవీఆర్ కుమార్, నారాయణ, జమాలుల్లా, శ్రీనివాసమూర్తి, వేగూరు రాజేంద్రప్రసాద్, అరవ పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యువతి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. మండల పరిధిలోని కాదలూరు గ్రామానికి చెందిన బిందుప్రియ భర్తతో గొడవపడి కొద్ది రోజులుగా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. శనివారం నుంచి కనిపించకపోవడంతో గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సూళ్లూరుపేటలో అకస్మాతుగా ఆగిన జైపూర్ ఎక్స్‌ప్రెస్

సూళ్లూరుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కచ్చేరివీధిలో ఉన్న రైల్వేగేటు వద్ద శనివారం చెన్నై నుంచి జైపూర్ వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఐదు నిమిషాల పాటు ఆగిపోయింది. ఎం1 బోగిలో ఓ ప్రయాణికుడికి చైన్ తగులుకోవడంతో రైలు ఆకస్మాతుగా ఆగిపోయింది. వెంటనే టెక్నికల్ టీమ్ అక్కడకు చేరుకుని బోగిని పరిశీలించారు. ఎటువంటి సాంకేతిక లోపం లేదని గుర్తించిన అనంతరం రైలు బయలుదేరి వెళ్లింది.

పుస్తక లక్షాధికారి

● లంకా సూర్యనారాయణకు నేడు జీవిత సాఫల్య పురస్కార ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చూడ్డానికి సాదాసీదాగా కన్పించే లంకా సూర్యనారాయణ లక్షకు పైగా పుస్తకాలు సేకరించి, సంరక్షిస్తున్నారంటే ఆశ్చర్యమేస్తుంది. గుంటూరులో పుస్తకాభిమానులు ముద్దుగా గ్రంథాళ్వార్‌గా పిలుచుకునే ఆయన గ్రంథాలయంలో చదువుకున్న అనేక మందికి ప్రపంచ విజ్ఞానం ఒంటబట్టింది. కుమారుడు కూడా వరంగల్ నిట్‌లో ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. ఎస్వీ యూనివర్శిటీలోని శ్రీనివాసా ఆడిటోరియంలో సూర్యనారాయణకు నేడు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనతో ఆంధ్రజ్యోతి సంభాషణ..

నేపథ్యం

మాది గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామం. వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్న పెదలక్ష్మీనారాయణ, రంగనాయకమ్మ. పత్తిపాడు హైస్కూల్లో పదవ తరగతి వరకూ, గుంటూరులో బీఎస్సీ దాకా చదివా. కస్టమ్స్ శాఖలో సూపరిండెంట్‌గా పనిచేసి రిటైరయ్యా. శ్రీ వేంకటేశ్వర ధార్మిక సేవా సమితి, అన్నమయ్య సేవా సమితి, స్వధర్మ సేవా సమితి అధ్యక్షులుగా పని చేశా.

పుస్తకాలపై ఆసక్తి

గాలీ నీరూ వెలుగూ అందరికీ ఎలా లభిస్తున్నాయో, పుస్తకాలు కూడా అంతగా అందుబాటులో ఉండాలనే చిలకమర్తి లక్ష్మీనరసింహం వ్యాఖ్య నాకు నిత్యస్ఫూర్తిని కలిగిస్తుంటుంది. దీంతో పాటు మా బాబాయి ఉప్పలపాటి ఆనందరావు కమ్యూనిస్టు కార్యకర్త. ఆయనకు విపరీతమైన పుస్తకాల పిచ్చి. ఆయన ద్వారా పుస్తకాలకు చేరువై లెక్కకుమించి చదివా.

గ్రంథాలయ ఏర్పాటుకు బీజం

గుంటూరులో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే ఆసక్తి కలిగింది.పుస్తకాలను సేకరించి, గ్రంథాలయంలో కొలువుదీర్చా. అనేకమంది సాహితీప్రముఖులు, పుస్తకాభిమానులు సందర్శిస్తుండడం చూసి నేను కూడా పుస్తక విజ్ఞాన వ్యాప్తికి కృషి చేస్తున్నాననే అనుభూతి కలుగుతుంది.ఈ గ్రంథాలయాన్ని భవిష్యత్తు తరానికి కూడా అందించాలనుకుంటున్నా.

పుస్తకాల సేకరణ

మా కుటుంబ వ్యక్తిగత గ్రంథాలయంలోనే 80 వేల పుస్తకాలుండేవి. అనేక మంది ప్రముఖులు మా ఇంటి లైబ్రరీకి వచ్చి పుస్తకాలు చదువుకునే వారు. ఇప్పుడు ఈ సంఖ్య లక్షా 30 వేలకు చేరింది. 100 మహాభాగవతాలు, 300 భాగవతాలు, 500 భగవద్గీతలు, 550 రామాయణాలు, 5 వేల ఆత్మకథలు, 51మంది అనువాదకులు చేసిన అనువాద గ్రంథాలు, 1600 శతకాలు, 700 నిఘంటువులు సేకరించా. వీటిలో ఏ పుస్తకమైనా కేటలాగ్ అవసరం లేకుండా క్షణాల్లో చేతికి అందించగలను. తెలుగు, ఇంగ్లీషు, హిందీ వంటి భాషలకు సంబంధించిన పుస్తకాలు కూడా అనేకం ఉన్నాయి. వివిధ భాషా, సాహిత్య రంగాల్లో పరిశోధన చేసే వారికి ఈ గ్రంథాలయం బాగా ఉపయోగపడుతుంది.

పుస్తకాభిమానులకు సలహా

పుస్తకాలను కొని చదవడమే కాదు, నలుగురికి అందించడం గొప్ప విషయం. మనం తెలుసుకున్న మంచి విషయాలను నలుగురికి తెలియజేయడం అవసరం. ఇది మనకు సంతృప్తిని కలిగించడమే కాక సమాజానికి కూడా మంచి చేస్తుంది.పుస్తకాన్ని మనం చదవడంతో పాటు అందరికీ చేరువ చేయడం పుస్తకాభిమానుల బాధ్యత.

లభించిన గుర్తింపు

నవ్యాంధ్ర రాష్ట్ర తొలి ఉగాది కళారత్న పురస్కారం పొందా.శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2017లో కీర్తి పురస్కారంతో సత్కరించింది. 2018లో అజోవిభో కందాళం పురస్కారాన్ని స్వీకరించా. జానుమద్ది హనుమచ్ఛాస్త్రి పురస్కారం, పాతూరి నాగభూషణం పురస్కారం, బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వారి పురస్కారం, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి సేవారత్న పురస్కార, సత్కారాలతో గుర్తింపు పొందా.

లక్ష్యం

ప్రస్తుతం తొంభై ఏళ్ల వయసులో ఒకే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. సేకరించిన పుస్తకాలను శాశ్వతంగా పరిరక్షించడానికి డిజిటలైజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నా.ఇందుకు పుస్తకాభిమానుల సహకారాన్ని కోరుతున్నా.



భక్తజన సంద్రం... ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. సుమారు 33వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 686 మంది, రూ.200 శీఘ్ర దర్శనం 4,578 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,245మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,060 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,226, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 351, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 307, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 100మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 28,995 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శ్రీనివాసుడే పరకామణి కేసు సాక్షులను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏడుకొండలవాసుడు శ్రీనివాసుడే పరకామణి సాక్షులను కాపాడుకోవాలని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పోలీసు అధికారినే హత్య చేశారంటే సామాన్యులు ఓ లెక్క అని అన్నారు. గత వైసీపీ పాలనలో మూతపడిన పరకామణి దోపిడీ కేసును పునర్విచారణ చేయడానికి హైకోర్టును ఆశ్రయించిన పాత్రికేయుడు మాచర్ల శ్రీనివాసులుకు తక్షణమే పోలీసు రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాటి పరిటాల రవీంద్ర నుంచి నేటి పరకామణి దోపిడీ వరకు పాత్రధారులు అనుమానాస్పద రీతిలో మరణించడానికి సూత్రధారులే కారణమన్నారు. పరకామణి కేసులో ప్రధాన ఫిర్యాది గా ఉన్న సతీష్‌కుమార్ అడ్డు తొలగించే అవసరం ఉన్నది ఆరోపణలు ఎదుర్కొంటున్న రవి కుమార్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, నాటి ఈవో ధర్మారెడ్డికే అని ఆరోపించారు. వారి పై హత్య కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. వన్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ రవి, భీమాల భాస్కర్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, చిల్ల కూరు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు: 24 దుంగల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం శ్రీకాళహస్తి మండల పరిధిలో కూంబింగ్ నిర్వహించి, నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ బృందం శనివారం నుంచి శ్రీకాళహస్తి మండలం ఆదవరం బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహించారు. ఆదివారం ఉదయం సదాశివకోన ప్రాంతం చేరుకునే సరికి కొంతమంది ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ వారి కంటబడ్డారు. చుట్టుముడు తుండగా దుంగలను వదలి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంబడించి ముగ్గురిని పట్టుకోగలిగారు. వారిని తమిళనాడులోని కుళ్లకురిచ్చి జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. ఆ ప్రాంతంలో పడి ఉన్న 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే శ్రీకాళహస్తి మండలం తీర్థాలపాల కోన వద్ద ఏఆర్ ఎస్ఐ మహేశ్వరనాయుడు బృందం కూంబింగ్ నిర్వహిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. వారు పోలీసులను గమనించి దుంగలు పడేసి పారిపోయే ప్రయత్నం చేశారు. ఒకరిని పట్టుకోగలిగారు. అతను తమిళనాడు కళ్లకురిచ్చి జిల్లాకు చెందినవాడిగా గుర్తించారు. సమీపంలో 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండుచోట్ల పట్టుబడ్డ స్మగ్లర్లను, 24 ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ ఖాదర్‌బాషా, ఎస్ఐ రఫీ కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి



ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో కళాశాల బృందం

నారాయణవనం, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ ప్రపంచంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోకరాజు పేర్కొన్నారు. కళాశాలలో ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (అపిటా) ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ పూల్ క్యాంపస్ జాబ్ డ్రైవ్ ఆదివారం ముగింపు సమావేశం నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా, నెల్లూరుకు చెందిన 43 ఇంజనీరింగ్ కళాశాలల నుండి 5,899 మంది నమోదు చేసుకోగా, 5,220 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 782 మందిని షార్ట్ లిస్ట్ చేసినట్టు తెలిపారు. ఫైనల్ ఫలితాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ప్రిన్సిపాల్ జనార్దన రాజు, మధు, అపిటా మేనేజర్లు లక్ష్మీప్రసాద్, అనిల్, ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులు దిషా, ప్రియాక్ష, ప్లేస్‌మెంట్ అధికారి మణిమోహన్ పాల్గొన్నారు.

కైలాసకోన పాలకమండలి ప్రమాణ స్వీకారం



నారాయణవనం, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక, అధ్యాత్మిక కేంద్రం కైలాసనాథ కోన ఆలయ పాలక మండలి చైర్మన్‌గా బాల చంద్రనాయుడు, సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం కైలాసకోనలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదవులను బాధ్యతగా నిర్వహిస్తూ ఆలయాభివృద్ధి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, జడ్పీటీసీ సభ్యుడు సుమన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు, మాధవులు నాయుడు, సురటుపల్లి ఆలయ కమిటీ చైర్మన్ పద్మనాభనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గిరిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు బియ్యం పంపిణీ



శ్రీకాళహస్తి/ కేవీబీపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు ముంపునకు గురైన పాతపాళెం, కళత్తూరు అరుంధతివాడలో ఆదివారం సుమారు 800 కుటుంబాలకు శ్రీకాళహస్తి పట్టణ టీడీపీ కార్యదర్శి కాసరం రమేష్ ఆధ్వర్యంలో భోజనం అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... రెక్కాడితే కాని డొక్కాడని ఎన్నో కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారన్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అనిల్‌రెడ్డి, మధు, మహేష్, రాకేష్, వివేక్, కంఠా సుబ్బు, తుమ్మ బాల, మురళి, నవీన్ తదితరులు పాల్గొన్నారు. కళత్తూరు, పాతపాళెం, అరుంధతివాడవాసులకు కళత్తూరుకుచెందిన కనపర్తి మధుసూదన రెడ్డి 30 క్వింటాళ్ల బియ్యాన్ని వితరణ చేశారు. ఆదివారం ఆయన తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి బియ్యాన్ని అందజేశారు.

గూళూరు చెరువు సమస్యను పరిష్కరించండి



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే భాను

వడమాలపేట/ పుత్తూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళూరు చెరువు తూములు సహా ఇతర చెరువుల మరమ్మతులపై దృష్టి సారించాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. ఆదివారం తిరుపతిలో ఎమ్మెల్యేను ఇరిగేషన్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వడమాలపేట మండలంలోని గూళూరు చెరువు తూముల మరమ్మతుల జాప్యంపై ప్రశ్నించారు. చెరువు వడమాలపేట మండల పరిధిలో ఉందని, ఆయకట్టు రైతులు పుత్తూరు మండల పరిధిలో ఉన్నారని అందరితో సమావేశం నిర్వహించి దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను పరిష్కరించాలని చెప్పారు. తూములు మరమ్మతులు చేపట్టకుంటే ఎస్బీఆర్ పురం ఆదిఆంధ్రవాడ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ముంపు పట్టాలు పొందిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఏది ఏమైనా రెండు గ్రామాల ప్రజలను సంప్రదించి సమస్యను పరిష్కరించాలని ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, డీఈ శ్రీనివాసులును ఎమ్మెల్యే కోరారు. అలాగే నియోజకవర్గంలోని మిగతా చెరువుల లీకేజీలు కాకుండా చూడాలని కోరారు.

20 మందిని విచారించిన పోలీసులు

రేణిగుంట నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే స్టేషన్లో అనుమానంగా సంచరిస్తున్న 20 మందిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు జమ్మూకశ్మీర్‌కు చెందిన వ్యక్తులుగా విచారణలో గుర్తించారు. రైల్వే పనులు చేయడానికి ఇక్కడికి వచ్చామని తెలపడంతో అందరినీ విడిచిపెట్టారు.

ఉత్కంఠ రేపుతున్న టీడీపీ మండల అధ్యక్షుల ఎంపిక

సత్యవేడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ మండల అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఎమ్మెల్యే సస్పెన్షన్ కారణంగా ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడంతో, నియోజకవర్గ పార్టీ వ్యవహారాలన్నింటిని టీడీపీ అధిష్ఠానం నియోజకవర్గ పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డికి అప్పగించింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో వారం రోజులుగా మండలాలు, గ్రామ కమిటీల నియామక ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. రెండు, మూడు రోజుల్లో పార్టీ మండల అధ్యక్షులను ప్రకటించే అవకాశం ఉంది. దీంతో నియోజకవర్గంలో అధ్యక్ష పదవుపై జోరుగా చర్చ సాగుతోంది.

తెరపైకి ఆశావాహులు...

నియోజకవర్గంలో టీడీపీ మండల అధ్యక్ష పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య భారీగా ఉంది. సత్యవేడు మండల అధ్యక్ష పదవి కోసం తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివకుమార్ పేరు వినిపిస్తోంది. అదే విధంగా ప్రస్తుతం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు పరమశివం, బీసీ సామాజిక వర్గానికి చెందిన నరేంద్ర, మరో సీనియర్ నేత లోకయ్య రెడ్డి, కృష్ణచైతన్య, బాబు యాదవ్ పేర్లు పరిశీలన ఉన్నట్లు తెలుస్తోంది.

- **నాగలాపురం మండలంలో...** ప్రస్తుత మండల అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, సీనియర్ నేత టీజే బాలాజీరెడ్డి కుమారుడు ప్రణీత్‌రెడ్డి మధ్య పోటీ నెలకొని ఉంది. అదే విధంగా మండలంలో ప్రధాన సామాజికవర్గానికి చెందిన ఎం.డి.కుమార్, సెల్వకుమార్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.
- **పిచ్చాటూరు మండలంలో...** సీనియర్ నేత సతీష్‌నాయుడు, పేరం గిరిబాబు మధ్య పోటీ నెలకొంది. అదే విధంగా పద్మనాభరాజు కుటుంబ సభ్యుల్లో ఒకరు ఈ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం.
- **వరదయ్యపాళెంలో...** యువనేతలు పన్నెం నిర్మల్, రామినేని పవన్‌మధ పోటీ నెల కొంది. మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు.
- **బుచ్చినాయుడుకండ్రిగలో...** మనోహర్ నాయుడు, మునిచంద్రనాయుడు, చెంచు రామయ్య నాయుడు మధ్య పోటీ నెలకొని ఉండగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు సుధాకర్ నాయుడు పేరు బలంగా వినిపిస్తుంది.
- **కేవీబీపురంలో...** బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ పేరు ప్రముఖంగా వినిపిస్తుండగా మరో సీనియర్ నేతలు రామానుంజలునాయుడు, గోపినాథ రెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు.
- **నారాయణవనంలో...** ప్రస్తుతం మండల అధ్యక్షుడు గిరిబాబు పేరు ప్రముఖంగా వినిపిస్తుండగా మరో ఇద్దరు నేతలు కూడా ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం.

మండల అధ్యక్షుల ఎంపికలో అనేక మంది సీనియర్ నాయకులు ప్రత్యక్ష ప్రమేయం చూపుతుండడంతో కమిటీ ప్రక్రియ క్లిష్టంగా మారింది. దశాబ్దాల తమ రాజకీయ అనుభవం, బలోపేతం, కార్యకర్తల నిబద్ధత వంటి అంశాలను ఆధారంగా చేసుకుని పదవుల కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.దీంతో కూరపాటి శంకర్‌రెడ్డి ముందు సమీకరణలు, లెక్కలు పెద్ద సవాలుగా మారాయి. కమిటీల్లో శంకర్‌రెడ్డి ముద్ర కనిపిస్తుందా...లేక సీనియర్ల సూచనల మేరకే కీలక పదవులు ఖరారు అవుతా యా...? అన్న ప్రశ్న ప్రస్తుతం టీడీపీ వర్గాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

ముగిసిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెన్స్ వార్షిక సమావేశం

రాష్ట్రంలో మొదటిసారిగా చారిత్రక వైజ్ఞానిక ఉత్సవం ● పరిశోధన, ఆవిష్కరణల మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు స్థానం



సదస్సులో ప్రసంగిస్తున్న ఐసర్ రిజిస్ట్రార్ కోహ్లీ

ఏర్పేడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్రీయ దృక్పథానికి కొత్త అధ్యాయం లిఖిస్తూ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)లో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెన్స్(ఐఏఎస్) 91వ వార్షిక సదస్సు ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఐసర్ రిజిస్ట్రార్ డైరెక్టర్ ఇంద్రప్రీత్ కోహ్లీ మాట్లాడుతూ... ఈ వార్షిక సమావేశం తమ సంస్థ శాస్త్రీయ ప్రయాణంలో కొత్త అధ్యాయాన్ని ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో సీఐఐ పెట్టుబడి సదస్సు జరుగుతున్న తరుణంలో దేశంలో ప్రముఖ మేధావులకు ఆతిథ్యం ఇవ్వడం ఆంధ్రప్రదేశ్‌లో సైన్స్, పరిశ్రమల ఆవిష్కరణల శక్తివంతమైన కలయికను సూచిస్తుందన్నారు.

సైన్స్ అవుట్ రీచ్

విద్యార్థులకు ప్రేరణ, ముఖ్యంగా ఐసర్ తిరుపతి ఈ మేధోపరమైన సెషన్లతో పాటు ఈ ప్రాంతంలోని పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా సైన్స్ ప్రచారం(ఔట్రీచ్) పట్ల తన నిబద్ధతను చాటుకుంది. భవిష్యత్తు తరాలను ప్రేరేపించాలనే లక్ష్యంతో యువ మేధావులకు ప్రాక్టికల్ సైన్స్ ఇంటరాక్షన్లు, మోటివేషన్ సెషన్లను నిర్వహించారు.

చారిత్రక ప్రాధాన్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ స్థాయిలో జరిగిన మొట్టమొదటి జాతీయ శాస్త్రీయ సమావేశం ఇదే కావడంతో చారిత్రక ప్రాధాన్యతను చాటింది. తద్వారా రాష్ట్రం, జాతీయ, అంతర్జాతీయ శాస్త్రీయ, విద్యాపరమైన మ్యాప్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. మూడు రోజుల పాటు జరిగిన ఈ సమావేశంలో దేశంలోని ప్రముఖ సంస్థల నుంచి ప్రముఖ శాస్త్రవేత్తలు, అకాడమీ సభ్యులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. వ్యాక్సిన్ అభివృద్ధి, సుస్థిరత, ఖగోళ భౌతిక శాస్త్రం, ఏఐ ఆధారిత సైన్స్, వాతావరణ అధ్యయనాలు, పరిణామ జీవావరణ శాస్త్రం వంటి అత్యాధునిక రంగాలను కవర్ చేస్తూ ఆసక్తికరమైన ఉపన్యాసాలు, చర్చలు జరిగాయి. శక్తివంతమైన ఆలోచనల మార్పిడికి, విజ్ఞాన సహకారానికి ఈ సదస్సు వేదికైంది.

వైభవంగా అయ్యప్పస్వామి ఊరేగింపు



వరదయ్యపాళెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయ్యప్పస్వామిని మాలధారణ స్వాములు వైభవంగా ఊరేగించారు. చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం వద్ద అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఉన్న సిద్దేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మురళిస్వామి, తిలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన అనిల్‌కుమార్ గడేపల్లి దంపతులు రూ.లక్ష అందజేశారు. వెంకటగిరికి చెందిన కలగండ సుబ్రహ్మణ్యం, ఇందిర దంపతులు రూ.62,500ను విరాళంగా ఇచ్చారు. వీటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇళంగోవన్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు

సత్యవేడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండల టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డికి టీడీపీ కేంద్ర కార్యాలయం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇళంగోవన్ రెడ్డి వైఖరితో నియోజకవర్గంలో టీడీపీకి నష్టం జరుగుతున్నట్లు అధిష్ఠానానికి ఫిర్యాదులందాయి. దీంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇళంగోవన్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారన్న ఆరోపణలపై ఇళంగోవన్‌రెడ్డి ఈనెల 18వ తేదీ టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

8వ పే కమిషన్‌లో అన్ని ప్రయోజనాలను కల్పించాలి

రేణిగుంట, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షనర్లకు 8వ పే కమిషన్‌లో అన్ని ప్రయోజనాలు కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీకి వినతి చేసినట్టు ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్ల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు. ఆదివారం సీఆర్ ఎస్ ఆస్పత్రికి వచ్చిన ఆయన్ని అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జయంతి కుమార్, విజయ్‌కుమార్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం



వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని నగిరివీధిలో ఉన్న సంస్థ కార్యాలయం వద్ద వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... 167 నెలలుగా నిత్యవసరాలు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా, సభ్యులు గరికపాటి రమేష్ బాబు, రాజేశ్వరరావు, కంఠా ఉదయ్‌కుమార్, బాబాఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయండి: ఏఐఎఫ్‌టీయూ

శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఏఐఎఫ్‌టీయూ నాయకుల కోరారు. గుంటూరు వేదికగా డిసెంబరు 8, 9 తేదీల్లో జరిగే యూనియర్ సభలను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకులు మీరయ్య, జిల్లా నాయకుడు వీసీ వెంకటయ్య కోరారు. ఆదివారం సభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. భాస్కరయ్య, మస్తానయ్య, కోగిల ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తికి విచ్చేసిన కోట వినుత దంపతులు



అనుచరులతో మాట్లాడుతున్న వినుత

శ్రీకాళహస్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన మాజీ ఇన్‌ఛార్జి వినుత, ఆమె భర్త కోట చంద్రశేఖర్ ఆదివారం శ్రీకాళహస్తికి విచ్చేశారు. వారి డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్య కేసులో తమిళనాడు పోలీసులు వారిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దీంతో వారు సుమారు నాలుగు నెలల పాటు చెన్నైలోనే ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని వారి కార్యాలయానికి వచ్చారు. అనుచరులు అక్కడికి చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వినుత మాట్లాడుతూ... సుమారు ఏడేళ్ల నుంచి ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటం చేశామన్నారు. పవన్ కల్యాణ్ పిలుపుతోనే వీర మహిళగా తాను రాజకీయాల్లోకి వచ్చామన్నారు. తనపై జరిగిన రాజకీయ కుట్రను పవన్‌కల్యాణ్‌ను కలిసి వివరిస్తామన్నారు. జనసేన అధినేతను కలిసిన తరువాత మీడియా ముందు రాజకీయ కుట్రలను వెల్లడిస్తామన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

నారాయణవనం, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమునిచెరువులో సరోజమ్మ చారిటబుల్ ట్రస్ట్, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వాసన్ ఐ కేర్ వైద్యశాల సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. 45 మందిని శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. కోనేటి రవిరాజు, సుకన్య, వైద్యులు అనుదీప్, శాంతి, హేమకుమార్, సాయిరాం తేజ పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం



శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కవి సమ్మేళనం జరిగింది. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రచయిత, కవి, బాలసుబ్రహ్మణ్యం, కవులు ఆనందయ్య, కృష్ణయ్య, దుష్యంత్ పాల్గొని కవితలను వినిపించారు. గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయ అధికారి హరికృష్ణ సత్కరించారు.

కేటీ రోడ్డులో గుంతలకు మట్టితో సరి!



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డులో గుంతలకు ఆర్అండ్‌బీ అధికారులు మట్టి పోసి తూతూమంత్రంగా మరమ్మతులు చేపడుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కేటీ రోడ్డులో పలు ప్రాంతాల్లో గుంతలు ఏర్పడి వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు గుంతలకు తాత్కాలికంగా మట్టివేసి చేతులు దులుపుకుంటున్నారు. కేటీ రోడ్డుకు శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పిచ్చాటూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పంబట్టుకు చెందిన సి.పి.వాసుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే ఆదిమూలం ఆదివారం పంపిణీ చేశారు. ఉదయం 10.30 గంటలకు నారాయణవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వాసు అనారోగ్యంతో బాధపడి ఆస్పత్రి పాలై చికిత్స అనంతరం కోలుకున్నారన్నారు. ఆస్పత్రి ఖర్చులకు సంబంధించిన బిల్లులను సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేయగా మంజూరు చేశారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, బలరాంరెడ్డి పాల్గొన్నారు.

జనసేనను గ్రామస్థాయికి విస్తరిస్తాం

శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని గ్రామస్థాయికి విస్తరిస్తామని ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి అన్నారు. గురువారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. త్వరలోనే మండల, గ్రామ కమిటీలను నియమిస్తామన్నారు. కుమార్, గరికపాటి చంద్ర, జయప్రకాష్, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఐఐ సదస్సు విజయవంతంపై హర్షం

శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో సీఐఐ సదస్సు విజయవంతంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సారథ్యంలో వైజాగ్‌లో నిర్వహించిన సీఐఐ సదస్సు ద్వారా రాష్ట్రానికి 13,25,716 కోట్ల పెట్టుబడులతో 613 సంస్థలు ఒప్పందం చేసుకున్నాయన్నారు. దీంతో సుమారు 16 లక్షల మందికి ఉపాధి లభించనుందన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, మునెయ్య, సదాశంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా హర్ష

రేణిగుంట నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా హర్ష నియమితులయ్యారు. ఇటీవల ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డి సస్పెన్షన్‌కు గురి అయిన విషయం విదితమే. ఆయన స్థానంలో చిత్తూరు డీఐజీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హర్షాను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ డీఐజీ గిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు.